క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పాలకొండ: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్‌లను తహసీల్దార్ వరహాలు శనివారం పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసి కేంద్రాలను పరిశీలించి, కావాల్సిన మౌలిక వసతులపై ఆరా తీశారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు కోసం గదులను పరిశీలించారు.

సుఖ ప్రసవాలపై దృష్టి సారించండి

● డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



డాక్టర్ ఉమామహేశ్వరితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

వీరఘట్టం: ప్రభుత్వాస్పత్రులకు వస్తున్న గర్భిణులు సుఖప్రసవం అయ్యేలా వైద్యాధికారులు దృష్టి సారించాలని డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, తదితర కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తున్నదీ ఆరా తీశారు. రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. కుక్క, పాముకాటుకు సంబంధించిన వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

రైతులకు బిందు సేద్యం పరికరాలు

పాలకొండ రూరల్: బిందు సేద్యానికి సంబంధించి రాయితీపై పరికరాలు పొందేందుకు ఔత్సాహిక రైతులు ఈ నెల 12న సమీప ఆర్‌బీకేల్లో సంప్రదించాలని వ్యవసాయశాఖ ఎ.డి కె.రత్నకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరికరాలు పొందేందుకు కనీసం ఎకరా భూమి కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆ భూమిలో నీటి ఇంజిన్ బోరు కచ్చితంగా ఉండాలన్నారు. వీటితో పాటు బ్యాంక్ అకౌంట్ నకలు, ఆధార్, రేషన్ కార్డు, రెండు పాస్ ఫొటోలు, భూమికి సంబంధించిన వన్ బీ, ఇతర ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి..



తంపటాపల్లి గ్రామస్తులు, యువతకు సూచనలు చేస్తున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో యువత గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేలా ప్రజలను చైతన్యపరచాలని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని తంపటాపల్లి గ్రామాన్ని శనివారం రాత్రి సందర్శించి, ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ, ఇతర కారణాలతో గ్రామాల్లో ఘర్షణలు తలెత్తకుండా సమన్వయంతో వ్యవహరించాలన్నారు. నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.

అలరించిన నృత్యాలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

భామిని: మండలంలోని గురండి విద్యావికాస్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గాంధీరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు



నులి పురుగులు నివారణ మాత్రలు వేయిస్తున్న ఐసీడీఎస్ పీఓ సుగుణకుమారి

సీతానగరం: మండలంలోని జాతీయ నులి పురుగులు నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఐసీడీఎస్ పీఓ సుగుణకుమారి, వైద్యాధికారి డాక్టర్ రాధాకాంత్, డాక్టర్ పావని పర్యవేక్షణలో వైద్య సిబ్బంది నులి పురుగులు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ మేరకు గాదెలవలసలో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూలు పిల్లలకు ఎంఎల్‌హెచ్‌పీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నులి పురుగులు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. సీతానగరం పీహెచ్‌సీ పరిధిలోని బగ్గందొరవలస పాఠశాలలో వైద్య సిబ్బంది పలు గ్రామాల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం మాత్రలు వేయించుకోని వారికి శనివారం నులి పురుగులు నివారణ మాత్రలు వేయడం జరిగిందని వారు తెలియజేశారు.



సచివాలయ భవనం



వైద్య సేవలు అందిస్తున్న హెల్త్ క్లినిక్



మల్లమ్మగూడ గిరిజన గ్రామానికి వేసిన తారు రోడ్డు

ప్రగతిపథంలో సింగన్నవలస



అందుబాటులోకి వచ్చిన రైతుభరోసా కేంద్రం

- రూ.2.30 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల రూపంలో రూ. 8.18 కోట్లు
- గ్రామంలో సుందరంగా ప్రభుత్వ భవనాలు



పాలకొండ:

మండలంలోని సంగన్నవలస పంచాయతీ అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే సంగన్నవలస రూపురేఖలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పూర్తిగా మారిపోయాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కళ్లకు కట్టినట్లు కనబడుతున్నాయి. ఈ సచివాలయం పరిధిలో ఉన్న సింగన్నవలస, పరశురాంపురం, మల్లమ్మగూడ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి బాటలు...

గత ప్రభుత్వ హయాంలో కనీసం సౌకర్యాలు లేని సింగన్నవలస పంచాయతీ ప్రస్తుతం అన్నివిధాలా అభివృద్ధి చెందింది. రూ. 40 లక్షలతో సచివాలయ భవనం, రూ. 30 లక్షలతో రైతుభరోసా కేంద్ర భవనం, రూ. 25 లక్షలతో గ్రామీణ హెల్త్‌సెంటర్ ఏర్పాటు చేశారు. ఇదే గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను నాడు -నేడు నిధులు రూ. 25 లక్షలతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. సింగన్నవలస నుంచి మల్లమ్మగూడ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర తారురోడ్డు వేశారు. గ్రామం నుంచి మురుగు నీరు వెళ్లేందుకు కాలువలు ఏర్పాటు చేశారు. ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.20 లక్షల నిధులు మంజూరు కావడంతో ప్రస్తుతం పనులు పరిశీలనలో ఉన్నాయి.

పక్కాగా సంక్షేమ పథకాలు..

గ్రామంలో సంక్షేమ పథకాలు పక్కాగా అమలవుతున్నాయి. సచివాలయ సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు త్వరితగతిన సేవలు అందిస్తున్నారు. మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోనే అందుతున్నాయి. ఇంత వరకు గ్రామంలో సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారులకు రూ. 8.18 కోట్ల నిధులు అందించారు. డీబీటీ పథకంలో భాగంగా మరో రెండు కోట్లు అందించారు.

అభివృద్ధి జరిగింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మా పంచాయతీ అభివృద్ధి చెందింది. ప్రభుత్వ భవనాలు నిర్మించారు. ఏ పని కావాలన్నా స్థానికంగానే జరిగిపోతోంది. రోడ్లు, కాలువలు, విద్యుత్ దీపాలు, తదితర సౌకర్యాలన్నీ కల్పించారు. సచివాలయ వ్యవస్థతో ఎంతో మంచి జరుగుతోంది. – బి. వేణు, సింగన్నవలస



నాడు-నేడు అభివృద్ధి చెందిన పాఠశాల భవనం

రూ. 1.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం



రోడ్డుకు ఇరువైపులా జేసీబీలతో చదును చేస్తున్న దృశ్యం

కురుపాం: మండలంలోని గొటివాడ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. రూ.1.2 కోట్ల వ్యయంతో ప్రస్తుతం రోడ్డు పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. కొన్ని దశాబ్దాలుగా సరైన రోడ్డు లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇదే సమస్యను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లగా, స్పందించిన ఆమె రోడ్డు పనులకు అంచనాలు రూపొందింపజేసి, నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఒకటిన్నర కిలోమీటర్ల మేర జరుగుతున్న ఈ రోడ్డులో భాగంగా ప్రస్తుతం మూడు కల్వర్టుల నిర్మాణాలు జరిగాయి. త్వరితగతిన పనులు పూర్తి చేసి, రోడ్డును వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటున్నారు. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వసతిగృహాల్లో దోమల నివారణకు చర్యలు

● జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు



విద్యార్థుల వసతిగృహంలో దోమల మందు స్ప్రే చేయిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్మోహనరావు

కొమరాడ: జిల్లాలోని అన్ని వసతిగృహాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఉలిపిరి, చినఖేర్జిల, కొమరాడ ప్రాంతాల్లోని గిరిజన సంక్షేమ వసతి గృహాలను శనివారం సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న దోమల మందు పిచికారీని పరిశీలించారు. దోమల కారణంగానే విద్యార్థులు తరచూ జ్వరాల బారినపడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు నిద్రించే గదులు, తరగతి గదుల్లో దోమల మందు పిచికారీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మందు ప్రభావం రెండు నెలల పాటు ఉంటుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి వసతిగృహాల సంక్షేమ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు, సబ్‌యూనిట్ అధికారి సీహెచ్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా వెంకట దామోదర్



మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడిగా బొబ్బిలి వెంకట దామోదర్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ ఉరిటి రామారావు హాజరై, కాసేపు మాట్లాడారు. సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తూ రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలన్నారు. బొబ్బిలి అప్పలనాయుడు మృతితో ఈ పదవి ఖాళీగా ఉండడంతో అదే పదవిని అదే కుటుంబానికి మళ్లీ ఇవ్వాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సూచించారన్నారు. రైతులకు మెరుగైన సేవలందించడంతో పాటు సొసైటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. సొసైటీ సీఈవోగా ఎస్.గుంపస్వామి కూడా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ఇందుమతి, పెద్దూరు సర్పంచ్ ఎం.నారాయణమ్మ, పీఏసీఎస్ సభ్యుడు బి.పకీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న లిప్ బృంద సభ్యులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం అందిస్తున్న వనరులు సద్వినియోగపర్చుకుని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధన దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం (లిప్) బృంద సభ్యులు అన్నారు. డిప్యూటీ ఈఓ పి.కృష్ణమూర్తి ఆదేశాల మేరకు మండంలోని ఓని ఎంపీయూపీ పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యసనాభివృద్ధి పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బృంద సభ్యులు బౌరోతు మల్లేశ్వరరావు, అప్పికొండ రాంబాబు, టి.అనిల్‌కుమార్, టి.సూర్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం..



పే స్లిప్‌లు ప్రదర్శిస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు

పాలకొండ రూరల్: ఆర్టీసీ ఉద్యోగులు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక డిపో సమీపంలో గల యూనియన్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి బొడ్డేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం నాలుగేళ్ల కిందట తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో సుమారు 52 వేల మంది ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారారని చెప్పారు. తాజాగా నైట్ అవుట్ డ్యూటీలు చేసే సిబ్బందికి నెలవారీ జీతంతో పాటు అలవెన్సులను అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనుక్షణం తమ ఉద్యోగుల బాగోగులు చూస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. తమకు అందిన పే స్లిప్‌లు ప్రదర్శిస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘసభ్యులు బీఆర్ కుమార్, ఎస్టీ రావు, బి.రమణ, సతీష్‌కుమార్, నీలయ్య, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించాలి : సీఐ

సాలూరు: విద్యార్థులు లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించాలని పట్టణ సీఐ జి.దేముడుబాబు అన్నారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని భాష్యం, సాయిసూర్య పాఠశాలల వద్ద శనివారం నిర్వహించిన పదవ తరగతి ప్రజ్ఞా వికాస కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. పరీక్ష ప్రశ్నపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ, పరీక్షలంటే భయాన్ని విద్యార్థులు విడనాడాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పట్టుదలతో విద్యను అభ్యసించడం వలన జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని అన్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పండు, తదితరులు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతలతో తెగుళ్ల బెడద



తమ్మినేని అమరేశ్వరి

పాలకొండ రూరల్: అధిక ఉష్ణోగ్రతల కారణంగా పుచ్చకాయల సాగుకు పలు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని ఉద్యానవన శాఖాధికారి తమ్మినేని అమరేశ్వరి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. ముఖ్యంగా పుచ్చకాయల పైరుకు తామర పురుగు, రసం పీల్చు, తేనెబంక, ఎర్రనల్లి తెగుళ్ల ఆశించే అవకాశం ఉందన్నారు. తెగుళ్ల నివారణకు ఎకరా పొలంలో నీలి, పసుపు రంగు అట్టలు పది వరకు ఏర్పాటు చేసి వాటికి జిగిరు పూయడం వల్ల పురుగులు అట్టలకు అతుక్కుని నశిస్తాయన్నారు. అలాగే 15 వందల పీపీఎం కలిగిన వేప నూనె లీటరు నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని సూచించారు. తామర పురుగు నివారణకు లీటర్ నీటిలో 2 ఎం.ఎల్ ఫిప్రోనిల్ లేదా 0.3 ఎం.ఎల్ ఇమిడాక్లోప్రిడ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. తేనె బంక నివారణకు 200 లీటర్లలో 400 ఎం.ఎల్ డైమిథియేట్ కలిపి పిచికారీ చేస్తే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. అలాగే ఎర్రనల్లి నివారణకు లీటర్ నీటిలో 1.25 స్పైరోమెసిన్ లేదా 2 ఎం.ఎల్ ప్రాపర్‌గైట్ కలిపి పిచికారీ చేయాలన్నారు.

గుమ్మిడి కొండ శివరాత్రి జాతరకు ఏర్పాట్లు

సాలూరు రూరల్: సాలూరు మండలం కావుడివలస వద్ద గుమ్మడికొండ గృహల్లో ఉన్న శివాలయంలో శివరాత్రి జాతర ఏర్పాట్లు నిర్వహణ కమిటీ చేస్తుందని కమిటీ ప్రతినిధి బంగార్రాజు తెలిపారు. శివాలయంలో ఉన్న శివలింగాన్ని పూజించేందుకు శివరాత్రి రోజున వేలాది మంది భక్తులు వస్తుంటారని తెలిపారు. ఈ ఏడాది కొండపైకి ఎక్కేందుకు నిర్వహణ కమిటీ మెట్లును నిర్మించామని భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు.

మూడు రోజుల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం

● ఎమ్మెల్యే జోగారావు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్:

మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యకు మూడు రోజుల్లో పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. మండల ప్రజాప్రతినిధులతో డి.శిర్లాం సీపీడబ్ల్యూఎస్ వాటర్ స్కీం ప్రాజెక్టును శనివారం క్షేత్ర స్థాయి పరిశీలన చేసి వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండల పరిధిలో గల సుమారు 64 గ్రామాలకు డి.శిర్లాం సీపీడబ్ల్యూఎస్ వాటర్ స్కీం ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ ప్రాజెక్టు గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రూ.33 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఇటీవల స్కీంలో ఏర్పడిన అనుకోని సమస్య మూలంగా గత సోమవారం నుంచి ఈ వాటర్ స్కీం పరిధిలో ఉన్న గ్రామాలకు తాగునీరు సరఫరా ఆగిపోయిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వెనువెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను గుర్తించి వాటర్ పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

త్వరితగతిన సమస్యకు పరిష్కారం

డి.శిర్లాం సీటీడబ్ల్యూఎస్ వాటర్ స్కీం బావి లోపల లీక్ కావడం చేత ఇసుకు లోపలకు చేరి ఐదు అడుగుల మేర ఇసుక మేట వేయడం వల్ల రెండు ప్రధాన పంపింగ్ పైపులకు అడ్డంగా ఇసుక పేరుకుపోయి మోటారులతో మంచినీరు తోడే పరిస్థితి లేని విషయాన్ని శ్రీకాకుళం నుంచి రప్పించిన ప్రత్యేక నిపుణులు గుర్తించారన్నారు. ఇసుకను నీటిలో నుంచి తీయించి ప్రధాన పంపులకు అడ్డంకి లేకుండా చేయడానికి మరో మూడు రోజుల సమయం పడుతుందన్న విషయం అధికారులు చెప్పారన్నారు. ఏది ఏమైనా వచ్చే మంగళవారానికి మంచి నీటి సరఫరా పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. ఈ వాస్తవ పరిస్థితిని ప్రజలు గుర్తించి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఏఈ, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ గురురాజు, ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధులు మజ్జి శేఖర్, బలగ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు సిద్ధ జగన్నాథరావు , బి.రవికుమార్, సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి జీడితోటలు దోహదం

● రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి విభాగం డైరెక్టర్ జనరల్ ఆర్.పి.సిసోడియా



కురుపాం: టేకరఖండిలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను తిలకిస్తున్న సిసోడియా



గిరిజనులకు అవార్డులు ప్రదానం చేస్తున్న రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి విభాగం డైరెక్టర్ జనరల్ సిసోడియా

గరుగుబిల్లి: గిరిజనుల ఆర్థికాభివృద్ధికి జీడితోటల పెంపకం ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి విభాగం డైరెక్టర్ జనరల్ ఆర్.పి.సిసోడియా అన్నారు. మండల పరిధిలోని తోటపల్లి జట్టు ట్రస్ట్‌లో ట్రస్టీ డి.పారినాయుడు ఆధ్వర్యంలో సుస్థిర జీడితోటలో అంతర పంటలు-మహిళా సంఘాలు కార్యక్రమంపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన పార్వతీపురం ఐటీడీఏ పీవోగా తాను పని చేసినప్పుడు గిరిజనుల పోడుభూముల్లో జీడితోటల పెంపకాన్ని ప్రోత్సహించి, వారికి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు. అవకాశం లభిస్తే మరోసారి ఈ ప్రాంతానికి సేవలందించాలని ఉందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో జీడిసాగు విధివిధానాలు అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా జీడిపంట ద్వారా అభివృద్ధి చెందుతూ స్ఫూర్తిగా నిలుస్తున్న పలువురు రైతులను జీడి రత్న అవార్డుతో సత్కరించారు. ఇదిలా ఉండగా, గిరిజనుల అభివృద్ధిని నిత్యం కృషి చేస్తున్న సిసోడియాకు జట్టు సిబ్బంది మన్య దీపధారి అవార్డును ప్రదానం చేశారు. నాబార్డు డీడీఎం టి.నాగార్జున మాట్లాడుతూ నిజాయితీగా పనిచేసే వారికి ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం ఎప్పటికీ ఉంటుందన్నారు. డీపీఎం పి.షణ్ముఖరావు మాట్లాడుతూ సరిగ్గా ముప్పై ఏళ్ల క్రితం చేసిన ఓ ప్రయత్నం నేడు లక్షలాది ఎకరాలకు విస్తరించిందని, ప్రస్తుతం జీడితోటల సాగుతో ఎంతోమంది గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో రచయిత రౌతు వాసుదేవరావు, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: మండల పరిధిలోని టేకరఖండిలో జీడితోటల సస్యరక్షణను రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి డైరెక్టర్ జనరల్ ఆర్.పి. సిసోడియా శనివారం సాయంత్రం పరిశీలించారు. జట్టు ట్రస్ట్, జిల్లా సేంద్రియ వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జీడితోటల పెంపకం ద్వారా అధిక దిగుబడులు, ఆదాయం పొందుతున్న రైతులతో మాట్లాడి, వారు అనుసరిస్తున్న సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. అధిక లాభాలు కోసం సంఘాలుగా ఏర్పడి, పలాస జీడి ప్రాసెసింగ్ ఫ్యాక్టరీకి పంటను విక్రయించాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం కూడా జీడి పంటను కొనుగోలు చేసి, రైతులను ప్రోత్సహించాలని కోరారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను పరిశీలించారు. జిల్లా సేంద్రియ వ్యవసాయ డీపీఎం షణ్ముఖరాజు, జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకుడు డి.పారినాయుడు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సిసోడియాకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారి ఆశీర్వచనాలు ఆయనకు అందజేశారు. ఆలయ విశిష్టత, నూతన నిర్మాణాల గూర్చి ఆలయ చైర్మన్ ఎం.సత్యనారాయణ, ఈవో వి.వి.సూర్యనారాయణలు వివరించారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం

పార్వతీపురం టౌన్: రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా డీపీటీఓ టీవీఎస్ సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం క్షతగాత్రులు రక్తం సమయానికి అందక మృతి చెందుతున్నారని ఆయన అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ సిబ్బంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలన్నారు. వాహనాలను నడిపేటప్పుడు రహదారి భద్రత నియమాలను విధిగా పాటించాలన్నారు.